

బళ్ళారి రైల్వేస్టేషన్లో 'అమరావతి ఎక్స్‌ప్రె-స్'కోసం ఎదురుచూస్తున్నాను.

"దయ్‌చేసి వ్నిండీ... హుబ్లీనుంచీ... గుంటుర్ పోయే... అమ్రాతీ ఎక్స్‌ప్రేస్ మ్రకొద్ది క్నాల్లో ... మూడ్వా నెంబర్... ప్లాట్‌ఫాం పైకి చేర్న్యూ...."

తెలుగుభాషను ఖూనీ చేస్తూ అర్థం పర్థం లేని యాసతో మైక్‌లో ఎనౌన్స్ చేసిన ప్రకటనను అర్థం చేసుకోడానికి నేను కొంత ప్రయాస పడవలసి వచ్చింది.

మరికొద్ది క్షణాల్లో అమరావతి ఎక్స్‌ప్రెస్ భారంగా నిట్టూరుస్తూ మూడవ నెంబర్ ప్లాట్‌ఫారమ్ చేరింది. ముందుగా రిజర్వేష-న్ చేయించుకోకపోయినా, టి.సి.చేత టికెట్ రాయించుకోవచ్చని రిజర్వేషన్ కంపార్ట్‌మెం-ట్‌లో దూరి ఖాళీగా ఉన్న సీట్లో కూల-బడ్డాను. రైలు బయలుదేరింది. ఒకసారి కంపార్ట్‌మెంటును పరికించి చూశాను. నా ప్రక్కన ఓ పడుచుజంట కూర్చుంది. ఆమె అతని భుజంమీద వాలి నిద్రో, పారవశ్య-మో తెలీని భంగిమలో అరమోడ్పు కన్నుల్తో జోగుతోంది. ఇంట్లో అవకాశం కుదరనట్టు రైళ్ళలోను, బస్సుల్లోను, సినీమా హాళ్లలో-ను, పార్కుల్లోనూ, బీచ్‌ల్లోనూ ఇలా పబ్లిగ్గా శృంగారాన్ని వెలగబెట్టే వాళ్ళని చూస్తే నాకు ఎలర్జీ(అసహ్యం). డిగ్నిఫైడ్‌గా ఎందుకుండరు వీళ్లు? అనుకున్నాను.'ఎవడి పిచ్చి వాడికా-నందం' అంటే ఇదే కాబోలు.

నాదృష్టి ఎదురుగా కూర్చున్న ఓ కుటుంబంమీద పడింది. ఆమె, అతను, వారిద్దరిమధ్యా ఓ మూడేళ్ళ పాప. వాళ్లిద్దరూ అలిగినట్టుగా మూతులు బిగించుకుని కూర్చు-న్నారు. నాపక్కనున్న జంటకు వీళ్లు పూర్తిగా విరుద్ధం. ఒకర్నొకరు అంటుకుంటే ఎక్కడ మైలపడిపోతామో అన్నట్లుగా ఒదిగొదిగి కూర్చున్నారు.

అసలు వీళ్ల ఆలుమగలా? కాదా? ఆమె పుట్టింటి నుంచి అత్తింటికి వెళ్తూ అత్తపెట్టే ఆరళ్ళు గుర్తుకు వచ్చి ముభావంగా కూర్చుందా? అతను మామగారు తనకు పండుగ బహుమతి ఇవ్వలేదని మూతిముడు-చుక్కూర్చున్నాడా? రైల్వే ప్లాట్‌ఫాంమీద ఆకస్మికంగా కనిపించిన అతని స్నేహితురాలు అతనితో మాట్లాడిందని ఆమె అలిగిందా? వాళ్ళిద్దరి ప్రవర్తనవల్లనాలో ఎన్నో అనుమా-నాలు చోటు చేసుకున్నాయి. అయినా. . వీళ్ళిలా వుంటే నాకేమిటట తంటా? నేను వాళ్లను నా మనసులోంచి దూరంగా తరిమే-స్తూ విండోలోంచి బయటకు చూడసాగాను. చీకట్లో కొండలు, తుప్పలు మసక మస-గ్గా కనిపిస్తూ కనుమరుగవుతున్నాయి. రైలు లయబద్ధంగా తాళం వినిపిస్తూ పరుగిడుతోంది. నాకో బలహీనత ఉంది. ఏదైనా సమస్య నా మనసులోకి వచ్చిందా - అది తీరేదాకా నాకు మనశ్శాంతి ఉండదు. రేపు తెల్లారగట్ల ఎక్కడికైనా ప్రయాణం పెట్టుకున్నానంటే ఆ రాత్రి తెల్లవార్లూ కంటిమీద కునుకుండ-దు. టైముకు మెలకువ వస్తుందో రాదో? బస్సులు దొరుకుతాయో దొరకవో? దొరికినా ఖాళీగా ఉంటాయా? ఒహవేళ ఎక్కేటప్పుడు ఎవడైనా దొంగ వెధవ జేబు కత్తిరించడు గదా- ఇలా సాగుతాయి ఆలోచన్లు. ఏ చిన్న సమస్యకైనా తీవ్రంగా స్పందించే మనసు నాది. అందుకే ఆ జంట అసలు భార్యా భర్తలా కాదా? తేల్చుకోమని నా మనసు ఊరికే నస పెడుతోంది.

అతనివైపు తిరిగి అన్నాను. "ఎక్కడికి వెళ్తున్నారు?"

"గుంటూరు."

"మీ పాపాండి?" వాళ్ళ మధ్యనున్న పాపాయిని చూపిస్తూ అడిగాను.

"ఔనండి."

అతని సమాధానం నాకు పెద్ద రిలీఫ్ కలిగించింది. "అమ్మయ్య! అనుమానం తీరింది. వీళ్ళు ఆలుమగలేనన్నమాట!"అను-కున్నాను. టి. సి. వచ్చాడు. ఒక్కొక్కరి టికెట్‌నూ చెక్ చేస్తూ రిజర్వేషన్ లేని నాలాంటి వాళ్ళకు రెసీట్ రాస్తూ కరెం-ట్ రిజర్వేషన్ ఇస్తూ డబ్బు వసూలు చేస్తున్నాడు. అతనివంతు వచ్చింది. అతను రైల్వే పాస్ తీసి టి సి.కి ఇచ్చాడు. టి-సి. చాలాసేపు పాస్‌ను పరిశీలించి "ఏం చేస్తుంటారు?" అడిగాడు.

"ఫైర్ మాన్" అతని సమాధానం.

"ఈమె...మీ ఫేమిలీయేగా"

ఈ ప్రశ్నకు అతను కొంచెంతడబాటుతో "ఆ...ఆ...అవును" అన్నాడు. టి.సి.కి ఏదో అనుమానం వచ్చి ఆమె వైపు తిరిగి ఒకే ఒక ప్రశ్న వేశాడు. "ఏమ్మా ఈయన మీ భర్తేనా?"

అది మామూలు ప్రశ్నకాదు. భారత మహిళ జాతి గౌరవానికి, భారతీయ సంస్కృ-తికీ అద్దం పట్టే ప్రశ్న! భారత మహిళ

# పెనాల్టీ

నుండి నిజాన్ని రాబట్టడానికి వేసిన ఆయువు పట్టులాంటి ప్రశ్న! ఆమె చాలసేపు మౌనం వహించింది.

నేనే కాదు పెట్టెలోని వాళ్లంతా ఆమె ఏం చెప్తుందా అని ఉత్కంఠతో ఎదురుచూ-స్తున్నాం. "తన భర్తను భర్తగా చెప్పడానికి సంకోచిస్తున్నదేమిటీమె? చెప్పెయ్యవమ్మా" నా మనసు లోపల ఆదుర్దా టి.సి.మళ్లీ అడి-

అదే ప్రశ్న. "ఇతను నీ భర్తేనా త్వరగా చెప్పమ్మా"టి.సి.తో సహా అందర్నీ ఆశ్చర్యంలో ముంచుతూ ఆమె నోరు విప్పింది.

ఆమె మనసులో రేగే అంతర్మథనానికి ఫుల్‌స్టాప్ పెడ్తూ-"కాదు. ఇతను నా భర్తకాదు. నా భర్త రైల్వేలో పని చేయడం వరకు నిజమే. కాని ఇతను నా భర్త కాదు. మరిది• మా వారి తమ్ముడితను. మా వారికి వేరేపనుండి ఇంటి దగ్గర ఉండిపోయారు మేం గుంటూరు ఒక ముఖ్యమైన పెళ్లికి వెళ్తున్నాం." ఆమె మళ్లీ మళ్లీ ప్రశ్నలకు తావు లేకుండా వివరంగా అంతా చెప్పేసింది సమస్య విడిపోయింది. తన అన్నగారి పాస్ మీద ఇతను ప్రయాణం చేస్తున్నాడు. టి.-సి. అతని చేత అరవై మూడు రూపాయలు కట్టించుకుని "ఇంకెప్పుడూ ఇలా చేయకండి. ఉద్యోగాలు పోతాయి" అని వార్నింగ్ ఇచ్చి వెళ్ళిపోయాడు.

టి.సి. అటువెళ్లగానే అతను ఆమెపై విరుచుకుపడ్డాడు "ఏంకొంప మునిగి-పోతుందని అలా చెప్పావ్ వదినా, ఒక్కమాట "ఔను" అంటే సరిపోయేదిగా•పోనీ మాట్లా-డక్కర్లేదు ఔను అన్నట్టుగా తల ఊగిస్తే సరిపోయేదిగా. అరవై మూడు రూపాయలు ఎవరు తిన్నట్టు? ఇంటి దగ్గర అన్నయ్య చెప్పిందంతా గంగపాలు చేశావ్, ఇద్దరం తిట్లు తింటాం" అన్నాడు.

"ఏమో! ఆ టి.సి. అలా అడిగేసరికి నాకు మనస్సెందుకో ఎదురుతిరిగింది బాబూ అబద్ధం చెప్పలేకపోయాను. పోనీండి వెధవ డబ్బు. డబ్బుకోసం ఏ అబద్ధం అయిన ఫర్వాలేదు కాని అలా చెప్పలేం" అంటూ ఆమె తన మంగళసూత్రాన్ని తీసి కళ్లకద్దుకుంది.

"శభాష్ భారత మహిళా నీకు జోహా-ర్! ఒంటిమీద బట్టలు మార్చినట్టుగా భర్తల్ని మార్చే సంస్కృతి కాదు మనది. భర్త కాని వాడిని భర్తగా ఏ భారతీయ స్త్రీ చెప్పదు గాక చెప్పదు. మవ్వు మన భారతీయ సంస్కృతిని కాపాడావ్... "విత్తమాన ప్రాణ భంగమందు బొంకవచ్చు నధిప..." అనే పెద్దలు చెప్పిన 'కప్పదాటు' మార్గాన్ని త్రోసిరాజని ఇక్కడ నీకు పరువు పోయినా, డబ్బు పోయినాకూడా ధైర్యంగా నిజాన్ని చెప్పగలిగావ్" అని నేను మురిసిపోయాను.

## భయం !

"అన్యాయాలు జరిగిపోతున్నాయి
ఇకనైనా కళ్లు తెరవవా న్యాయదేవతా!"
అంటే
"అట్లాగే చెప్పండి ఎంత కాలమైనా
ఇట్లాగే వింటూ వుండగలను"
"కానీ....
కళ్లారా చూడమని చెప్పకండి
ఎందుకంటే...
నేనూ మీలాగే
నిజాన్ని నిర్భయంగా
చెప్పలేనేమోనని 'భయం' అంతే!!"

- శిడగం దొరయ్య


